క్లుప్తంగా

అజ్మీర్ షరీఫ్ దర్గాకు చాదర్ సమర్పణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ షరీఫ్ దర్గాకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం చాదర్ సమర్పించారు. వాంబేకాలనీలోని ఆస్థాన ఏ గరీబ్ నవాబ్ అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా ఆశ్రమం కమిటీ ప్రతినిధులు అజ్మీర్ వెళ్తుండటంతో వారికి ఆయన చాదర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లిం గురువులు అబ్దుల్ ఖయ్యూం రిజ్వీ సాబ్ సర్వమానవాళి సంక్షేమాన్ని కోరుతూ ప్రత్యేక దువా చేశారు. అల్లాహు ఆశీస్సులతో అజ్మీర్ షరీఫ్ ఖాజా బాబా కరుణా కటాక్షంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రిగా ఉండాలని ఎమ్మెల్యే విష్ణు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, ఖాజా బాబా ఆశ్రమం వ్యవస్థాపక ధర్మకర్త పఠాన్ బాబ్జి ఉమర్ ఖాన్, మైనారిటీ నాయకులు షేక్ గౌస్, షేక్ బాబు, ఇస్మాయిల్, నబీ, జిలాని, సలీమ్, ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమ పూజ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని చల్లపల్లి బంగ్లా సమీపంలో వేం చేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానం నందు మంగళవారం సామూహిక కుంకుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ధార్మిక కార్యక్రమాలో భాగంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో 200 మంది పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమ పూజ అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబ శివరావు, వంశపారంపర్య ధర్మకర్తలు, పెద్దలు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా



మధురానగర్(విజయవాడసెంట్రల్): 26వ డివిజన్‌లో తాగునీటి సమస్యల నివారణకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదేశానుసారం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యలు ఉన్నాయి. దీంతో వైఎస్సార్ సీపీ డివిజన్ కో ఆర్డినేటర్ కోలా నాగాంజనేయులు సమస్యను ఎమ్మెల్యే మల్లాది విష్ణు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నగర పాలకసంస్థ అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్య పరిష్కరించాలన్నారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. దీంతో నగరపాలక సంస్థ అధికారులు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.

పేదలకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కళ్లే లలిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ డైరెక్టర్లు కళ్లే సీతామహాలక్ష్మి, కళ్లే జయదుర్గలు పాల్గొని పేదలకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా 12వ తేదీన అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని, గత 23 నెలల నుంచి క్రమం తప్పకుండా ఇక్కడ అన్నదానం చేస్తున్నామని చెప్పారు. ట్రస్ట్ అధ్యక్షుడు కళ్లే నాగేశ్వరరావు ముందుగా కళ్లే లలిత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముప్పూరి హరీష్, ఎం.జశ్విన్, జి.ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన విరోతి అప్పారావు(65) అనే వృద్ధుడు గత నెల 19వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని భార్య రత్నకుమారి మంగళవారం నున్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు నున్న గ్రామంలో నరసింహస్వామిగుడి సమీపంలో నివాసం ఉంటున్న అప్పారావు కూలి పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వస్తుండేవాడు. గత నెలలో ఇంటి నుంచి వెళ్లిన అప్పారావు తిరిగి రాలేదని అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమగ్రాభివృద్ధి

- ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు



32వ డివిజన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 32వ డివిజన్ అయోధ్యనగర్ 230వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, డివిజన్ ఇన్‌చార్జి గుండె సుందర్‌పాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల సంక్షేమం పేదల అభ్యున్నతి జరగాలంటే సీఎం జగన్‌తోనే సాధ్యమని ప్రజలంతా విశ్వసిస్తున్నారన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సచివాలయ కార్యాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. 230వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో 9 కోట్ల 8 లక్షల 82 వేల 32 రూపాయల లబ్ధి చేకూర్చినట్లు ఎమ్మెల్యే విష్ణు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఒగ్గు గవాస్కర్, పేరం త్రివేణి రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి వార్డు సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పేదలకు బాసటగా జగనన్న ప్రభుత్వం

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రతి పేదవాడు ఆనందంగా ఉండాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ 261వ వార్డు సచివాలయం పరిధి శాంతినగర్‌లో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో మంగళవారం డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఘన నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని కుటుంబాలు మన ప్రభుత్వంలో హాయిగా జీవించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భవిష్యత్‌పై ఆశలు కల్పించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు అన్నారు. గత నాలుగున్నరేళ్లలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రూ.84.35 లక్షలతో శాంతినగర్ ప్రధాన రహదారి, రూ.69 లక్షలతో హెచ్ బ్లాక్‌లో రహదారులు, రూ.93 లక్షలతో శాంతి నగర్‌లో నూతన రోడ్లను నిర్మించామని తెలిపారు. ఎలక్ట్రిసిటీ కాలనీలో రూ.30 లక్షలు, ప్రగతి నగర్‌లో రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించామన్నారు. గత తెలుగుదేశం హయాంలో పాయకాపురం చెరువు ఆక్రమణలకు గురి కాగా ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్ది ప్రారంభించుకున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. హెచ్ బ్లాక్ లో రూ.70 లక్షలతో నూతన సచివాలయ భవనాన్ని నిర్మించి ప్రారంభించుకోవడం ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువైందన్నారు. 261 సచివాలయ పరిధిలో రూ.15.45 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ మోహన్‌బాబు, నాయకులు ఎండీ రఫీ, కోటేశ్వరరావు, ఆర్ఎస్ నాయుడు, అనిల్, మణికంఠ, నాగిరెడ్డి, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.



61వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు

భక్తిశ్రద్ధలతో కార్తిక మాసోత్సవాలు



లోటస్ ల్యాండ్ మార్క్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణు



ముత్యాలంపాడులో కర్పూర హారతి



విశేష అలంకరణలో స్వామి వారు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు చెప్పారు. స్థానిక అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో మంగళవారం సాయంత్రం శ్రీదేవీ సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఉచిత కుంకుమపూజలు, లలితా సహస్రనామ పారాయణం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్రమైన కార్తిక మాసంలో ఉచిత కుంకుమ పూజలు ఏర్పాటు చేసిన శ్రీదేవీ సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం సేవలు నిరుపమానమని కొనియాడారు. సంఘం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కుంకుమపూజల విశిష్టతను శ్రీదేవి వివరించారు. 500 మంది మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని, లలితా సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమాలను సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

ఇందిరా ఎన్‌క్లేవ్‌లో..

అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్‌లో పుసుమర్తి కామేశ్వరశర్మ పర్యవేక్షణలో దీపోత్సవం జరిగింది. శివ లింగాకారంలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి దేవాలయంలో మంగళవారం కార్తిక మాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్వామివారికి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 5 వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం 15 కిలోల కర్పూరంతో స్వామి వారికి కర్పూర హారతి ఇచ్చారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ రాజు, శివరామరాజు, సభ్యులు బడేటి ధర్మారావు, ఐఎస్ఎస్ రాజు, చిరంజీవి పర్యవేక్షించారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో..

అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మంగళవారం కార్తిక మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేషంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం బిల్వార్చన జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని దీపారాధన చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వర స్వామివారి దేవాలయంలో స్వామివారికి విశేషంగా పూజలు చేసి అలంకారాలు చేశారు.

వీఎంసీలో అంతర్గత బదిలీలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్యం విభాగంలో పలువురు సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. 11వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న నూతలపాటి జానకిరామయ్యను 37వ డివిజన్‌కు అక్కడ విధులు నిర్వహిస్తున్న బి.యోగేంద్రను 43వ డివిజన్‌కు బదిలీ చేశారు. 43వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న పి.రమేష్‌ను 11వ డివిజన్‌కు బదిలీ చేశారు. సర్కిల్-1 శానిటరీ సూపర్‌వైజర్ ఆర్.ఓబేశ్వరరావును వెహికల్ డిపో ఇన్‌చార్జిగా, 36వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీఎస్ శ్రీధర్‌ను అసిస్టెంట్ ఇన్‌చార్జిగా నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు ఇచ్చారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజాశక్తి నగర్‌కు చెందిన పిల్లి శ్రీనివాసరెడ్డి(46) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా తక్షణ సాయం కింద ఆ కుటుంబానికి 10 వేల రూపాయలను 64వ డివిజన్ కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, డాక్టర్ ఎస్‌కే బాసిద్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంగీత కళాకారులను ప్రోత్సహించాలి



విజయవాడకల్చరల్: సంగీత కళాకారులను గుర్తించి ప్రోత్సహించాలని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. లలిత కళా స్రవంతి, ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయలో మంగళవారం లలిత మనోహరం లలిత గీతాల ఆల్బమ్, సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు దంపతులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ సంగీత రంగంలో దావులూరి విశేషమైన కృషి చేశారన్నారు. వేలాది కార్యక్రమలకు వాద్య సహకారం అందించారని కొనియాడారు. ఆదిలీలా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆదినారాయణ లలిత గీతాల ఆల్బమ్‌ను ఆవిష్కరించారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్ పాల్గొన్నారు. గీత రచయిత్రి డాక్టర్ పద్మావతి శర్మ కృషిని అభినందించారు. శర్మ, పవన్ కుమార్, డి.పద్మజ, కామేశ్వరి తదితరులు ఘంటసాల గానం చేసిన గీతాలను మధురంగా ఆలపించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



వెహికల్ డిపోలో సిబ్బందిని విచారిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటానని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. హనుమాన్‌పేటలోని వీఎంసీ వెహికల్ డిపోను మంగళవారం ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణకు వెహికల్ డిపో నుంచి వెళ్లే వాహనాలకు వీఎంసీ ఇంధనానికి ధర చెల్లిస్తుందన్నారు. ఆ ఇంధనాన్ని డ్రైవర్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేపట్టారు. విచారణలో వాహన డ్రైవర్లు ఇంధనాన్ని దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. సదరు డ్రైవర్లు బొల్లా సూర్యప్రకాష్, మిందల జమల కేశవను విధుల్లో నుంచి సస్పెండ్ చేయటంతో పాటు పోలీస్ కేసు నమోదు చేశారు. దీనిపై పూర్తి విచారణకై అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) సత్యవతిని నియమించారు. ఈ సందర్భంగా వెహికల్ డిపోలో ఉన్న సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణకు కేటాయించిన వాహనాలు, దానిలో ఉన్న ఇంధనం ప్రతిదీ పారిశుద్ధ్య నిర్వహణకే ఉపయోగించాలన్నారు. పారిశుద్ధ్య వాహనలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉందని తద్వారా వాళ్లు ఎటువైపు వెళ్తున్నారో ప్రతిదీ రికార్డులో ఉంటుందని చెప్పారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం ఉండకూడదని హెచ్చరించారు.

ఏపీపీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): గ్రూప్-1, 2 ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఏపీపీఎస్సీ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్యను 2 వేలతో పాటు అభ్యర్థుల వయో పరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చా వేదిక నిర్వహించారు.

స్టడీ సర్కిల్స్ ప్రారంభించాలి..

ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 7న గ్రూప్-2 నోటిఫికేషన్ 897 పోస్టులకు, 8న గ్రూప్-1 నోటిఫికేషన్ 81 పోస్టులకు విడుదల చేసిందన్నారు. పోస్టుల సంఖ్య కనీసం 2 వేలకు పెంచాలని కోరారు. ముందు గ్రూప్-2 నిర్వహించి తర్వాత గ్రూప్-1 నిర్వహిస్తే నిరుద్యోగులకు ఉపయోగం ఉంటుందన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాము, రామన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగులకు ఉచిత స్టడీ సర్కిల్స్ తక్షణమే ప్రారంభించాలని కోరారు. ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో తీసుకోవాలని, నెగిటివ్ మార్కులు పద్ధతిని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఎంప్లాయీస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన వేడుకలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సందక కృష్ణ, కోశాధికారి యెనిగళ్ల సుబ్బారావు తెలిపారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోగల అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వేడుకల వివరాలను వెల్లడించారు. పెన్షన్ పితామహుడు స్మృత్యర్థం 75వ వసంతంలోకి అడుగిడిన 15 మంది పెన్షనర్లను సత్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసే క్యారమ్స్ పోటీలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తామని చెప్పారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్‌కె ఇనయతుల్లా, సభ్యులు డి.శేషగిరిరావు, పి.శ్రీనివాసరావు, పి.పట్టాభిరామారావు పాల్గొన్నారు. ఆహ్వాన పత్రికను విడుదల చేశారు.

ర్యాగింగ్ నిర్మూలనకు పటిష్ట చర్యలు

- ర్యాగింగ్ అంటూ దుష్ప్రచారం తగదు
- ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్



యాంటీ ర్యాగింగ్‌పై తీసుకున్న చర్యలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులను ర్యాగింగ్ చేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడితే విధించే శిక్షలను కూడా సీనియర్స్‌కు తెలియజేశామన్నారు. తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్య కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనకు తీసుకున్న చర్యలను వివరించారు. కొన్నేళ్లుగా కొత్తగా చేరిన విద్యార్థులను సపరేట్ బ్లాక్‌లో ఉంచుతున్నట్లు తెలిపారు. వారికి ఆహారం కూడా రూమ్స్‌కి అందజేస్తున్నామన్నారు. కొత్త విద్యార్థులు హాస్టల్ నుంచి కాలేజ్‌కి, లైబ్రరీకి వెళ్లేటప్పుడు సెక్యూరిటీ ఉంటుందన్నారు. అంతేకాకుండా ప్రతి రోజూ రాత్రి 8 నుంచి 10 గంటల మధ్య బీట్ కానిస్టేబుల్స్‌తో పాటు, ఎస్ఐ కూడా రౌండ్స్ వేస్తుంటారని, వారంలో ఒకటి, రెండు సార్లు సీఐ కూడా రౌండ్స్‌కి వస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. కళాశాలలో యాంటీర్యాగింగ్ కమిటీ ఏర్పాటు చేశామని, అది ఎప్పుడూ మానిటరింగ్ చేస్తుంటుందన్నారు.

దుష్ప్రచారం నమ్మవద్దు..

ఉత్తర భారదేశం నుంచి వచ్చిన విద్యార్థులను హాస్టల్‌లో ర్యాగింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలు దుష్ప్రచారమేనని ఆయన పేర్కొన్నారు. ఎవరూ నేషనల్ మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు చేయలేదని, వారి నుంచి కళాశాలకు కూడా ర్యాగింగ్‌పై ఎలాంటి మెయిల్స్ రాలేదన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. కళాశాల ప్రతిష్టతను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారం చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం సీనియర్ విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని ఆయన తెలిపారు.

ప్రతి పథకం చరిత్రలో నిలిచిపోతుంది



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం చరిత్రలో నిలిచిపోతుందని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గాంధీనగర్ 36వ డివిజన్ 192వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్‌తో కలిసి ఎమ్మెల్యే విష్ణు గడప గడపకు వెళ్లారు. ఆంధ్రరత్న రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, జొన్నవిత్తుల వారి వీధి, పీవీఆర్ స్ట్రీట్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ ప్రజా రంజక పాలన గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో రూ.3.63 కోట్ల సంక్షేమం జరిగిందన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

టీడీపీ–జనసేన కాంబినేషన్ అట్టర్ ఫ్లాప్

వైఎస్సార్ సీపీని ఢీకొనే సత్తా రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీకి లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తెలుగుదేశం – జనసేనలది అట్టర్ ఫ్లాప్ కాంబినేషన్ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కాంబినేషన్ల గూర్చి మాట్లాడే ముందు.. ఇప్పటి వరకు ఇరు పార్టీలు ఎన్నిసార్లు కలిశాయో, ఎన్ని సార్లు విడిపోయాయో నారా లోకేష్ సమాధానం చెప్పాలన్నారు. మరోసారి వీరి కలయికతో కొత్తగా జరిగే అద్భుతాలు ఏమీ ఉండబోవన్నారు. కార్యక్రమంలో నాయకులు పులపా కృష్ణ, రామకృష్ణ, రెడ్యం ఆర్కే, రాడ భాస్కర్, యడ్ల రాంబాబు, పఠాన్ భూపతి, ఇప్పిలి శ్రీను, పప్పుల శివ, తాటి శివ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి తదితరులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద్వితీయస్థానం సాధించటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు మరింత అత్యుత్తమ ప్రదర్శనతో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. వ్యాయామ విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు డాక్టర్ డి.యుగంధర్ పర్యవేక్షణలో చాంపియన్‌షిప్ రన్నర్స్‌గా నిలవటం కళాశాలకు గర్వకారణమన్నారు. తమ విద్యార్థులు కే కిషోర్, జీ తరుణ్ కుమార్, జీ వెంకటేష్, సీ ఉమేష్ దుర్గారామ్‌లు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను అధ్యాపకులు డాక్టర్ పద్మనాభం, సిబ్బంది అభినందించారు.

అక్షీశ్వర మహాదేవునికి తండులాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసం అమావాస్యను పురస్కరించుకుని లోక కల్యాణార్థం అన్నసంతర్పణ సమితి ఆధ్వర్యాన అక్షీశ్వర మహాదేవునికి రెండు వేల కిలోల బియ్యంతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. శ్రీ శివజ్ఞాన పీఠాధిపతి శ్రీ శివాచార్య స్వామి చేతుల మీదుగా తండులాభిషేకం జరిగింది. శివాచార్యస్వామి మాట్లాడుతూ చంద్రదోష నివారణ, మనస్సుకు ప్రశాంతత కలిగించేందుకు తండులాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. శివచార్య స్వామి విశేషంగా పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తొలుత అన్నసంతర్పణ సమితి అధ్యక్షుడు గుండు దిలీప్ రెండు వేల కిలోల బియ్యంను ట్రస్ట్ సభ్యులతో కలిసి స్వామివారికి సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు తండులాభిషేకంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మసీదు నిర్మాణానికి సహకరించాలని వినతి



ఎమ్మెల్సీ రుహుల్లాకు వినతి పత్రం అందజేస్తున్న మసీదు కమిటీ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అరండల్‌పేట అన్నదానం సమాజం రోడ్డులో పురాతన మసీదు పునఃనిర్మాణ పనులకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ మసీద్ హజరత్ మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వస్సలం కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ రుహుల్లాకు వినతిపత్రం అందజేశారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మంగళవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. గత 15 ఏళ్ల క్రితం రేకుల షెడ్డు నిర్మాణం చేశామని, అయితే ఇటీవల తుఫాన్ ప్రభావంతో షెడ్డు పూర్తిగా ధ్వంసమైందన్నారు. రేకులషెడ్డు స్థానంలో భవన నిర్మాణ పనులకు అనుమతి ఇప్పించాలని ఎమ్మెల్సీను కోరగా దానికి ఆయన సానుకూలంగా స్పందించారు. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి మసీదు నిర్మాణాన్ని తప్పకుండా పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు ఎండీ హఫీజుల్లా, మసీద్ కమిటీ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.